# గుడ్డిపూలు

ఎగువన వర్షాలు మొదలయ్యాయి. బేరేజీ నిండింది. కొన్ని లాకులు ఎత్తేశారు. వర్షం కుండపోత మీంచి వరద అవుతోంది.

సికిందరాబాద్ స్టేషన్‌లో అంత వర్షం లేదు. చినుకులు పడుతున్నాయి. వర్షం కురిసేట్టుగా ఉంది. ఎనిమిదీ నలబయికి బయల్దేరాల్సిన బండి పదకొండున్నరకేమో అయిష్టంగా బయల్దేరింది.

వాతావరణ సూచన ప్రకారం బంగాళాఖాతంలో వాయుగుండం బలపడుతోంది. పుదుచ్చేరి దాటింది. తమిళనాడు, ఆంధ్ర, ఒరిస్సాలోని ఏ తీరాన్నయినా దాటొచ్చు. లేదూ, బలహీనపడొచ్చు.

రైలు వేగం పుంజుకుంది. గాలి విసురుగా వీస్తోంది. వర్షం పలచగా కురుస్తోంది. వాతావరణం ఏ మాత్రం బాగా లేకున్నా బండిలో ప్రయాణీకులు నిండుగా ఉన్నారు. లిస్టుల ప్రకారం, ఏ సీటూ, బెర్తూ ఖాళీ లేకపోయినా డబ్బు పెట్టగలిగిన వాళ్ళకు బెర్తులు దొరుకుతున్నాయి, రైల్వే లయిన్లు బావున్నట్టు మధ్యమధ్యలో విజిలు వేస్తున్న శబ్దాలు వినిపిస్తున్నాయి.

దారిలో ఈరారం ఉంది. ఇప్పుడు ఈరారానికి ముప్పు వచ్చింది. ఎగువనీటికి చెరువు నిండుతోంది. ఆ జిల్లా మొత్తంలో ఈరారం చెరువే పెద్దది. రెండువేల గడప ఊరు. ఉన్నవాళ్ళ ఊరు కాబట్టి అన్ని సదుపాయాలున్నాయి. ఈరారం పక్కనే ఈ మధ్యనే రైలు వంతెన పడింది. ఒక అరవ మంత్రివచ్చి ప్రారంభోత్సవం చేసి ఆ వంతెనకు ఒక అరవ పేరు పెట్టి వెళ్ళాడు. ఆ వంతెన కట్టడానికి పదేళ్ళు పట్టింది. కట్టిన కూలీలంతా బీహార్ నుండి వచ్చినవాళ్ళు. కాంట్రాక్టర్లు అరవలు. ఆ వంతెనలేక పోయినా ఏ ఇబ్బంది ఉండదు. ఆ ఊళ్ళో పాసింజరు బండి మటుకు ఆగుతుంది. ఎప్పుడో గాని ఎవరూ ఎక్కరు. దిగేవాళ్ళుండరు. ఎక్కువ మంది ఎర్రబస్సులనే నమ్ముకుంటారు. అవి ఎప్పుడు వస్తుంటాయో, ఎప్పుడు వెళ్తుంటాయో డిపో మేనేజర్లకు

కూడా తెలియదు. ఉన్నవాళ్ళు తమ కార్ల కోసం, ఇసుక లారీల కోసం మంచి రోడ్లే వేయించుకున్నారు. మిగతా వాళ్లకు మట్టిరోడ్లే.

ఊరారానికి అయిదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సాయిపేట చాలా ఎత్తులో ఉంది. అది ఏనాడూ ముంపుకు గురి కాలేదు, ఎక్కువగా వర్షాలు కురిసినప్పుడు చుట్టుపక్కల గ్రామాలు ముంపుకు గురి అయినా నర్సాయిపేట తడవదు. కొందరు పెట్టి పుడతారు.

వాయుగుండం నెల్లూరుకు అవతల వంద కిలోమీటర్లు దూరంలో నిలబడి పోయింది. ఉత్తరం పోదు. దక్షిణం పోదు. అటూ ఇటూ చూసి ఎటు కొడుతుందో తెలియకుండా ఉంది. బలహీనపడినా పడొచ్చు.

ఎప్పుడూ లేనిది ఈసారి ఊరారం చెరువు డేంజరు లెవలు దాటింది. నిండుతోంది. ఊరి పెద్దలకు భయం పట్టుకుంది. చెరువు కట్టలు దాటిందంటే చేతికొచ్చిన పంట నాశనమవుతుంది. ఇళ్ళు దెబ్బతింటాయి. ఎంతో మంచిరోడ్లు కొట్టుకుపోతాయి. అన్నిటికి మించి దొంగతనంగా దాచిన వడ్లు, పప్పులు నీళ్ళపాలవుతాయి.

పెద్ద తలలు ఒక చోట చేరాయి.

"ఏం చేద్దాం?"

తలో మాట చెప్పారు. అందరూ పెద్దలవడాన ఒకరి మాట ఒకరికి నచ్చదు.

గుడిసెలు తగలబెట్టడంలో కొద్దో గొప్పో అనుభవం ఉన్న ఒకతను అన్నాడు, "చెరువుకు గండి కొడదాం."

"ఊళ్ళోకి నీళ్ళొచ్చి ఊరు మునిగిపోతుంది."

"తూర్పు వయిపు కాదు. పడమర వయిపు."

గంట తర్జనభర్జనలు జరిగాక రాస్తారోకోల్లో బస్సులు కాల్చడంలో బాగా అనుభవమున్న పదిమంది యువకులు, ముఖాలకు గుడ్డలు కట్టుకోకుండా, మామూలుగా అయితే ఎవరూ గుర్తుపట్టకుండా ముఖాలకు గుడ్డలు కట్టుకుంటుంటారు, పడమటి వయిపు గండి కొట్టారు. నీళ్ళు మూకుమ్మడిగా కదిలి ఈరారానికి అటువయిపుకు తరలాయి.

సారూ,

ఈరారం బతికింది. ఎవరికీ ఏ ఆపదా కలగలేదు. గొడ్డూ గోదా నిక్షేపంగా ఉన్నాయి.

వంతెనకు ఆరు కిలోమీటర్ల ముందు రైలింజను పట్టాలు తప్పింది. రైలింజనుకు ఆనుకున్న కంపార్టుమెంటు మటుకు ఒక పక్కకు ఒరిగింది. అంతే. అంతకు మించి ఏం కాలేదు. నలుగురు ప్రయాణీకులకు చిన్న దెబ్బలు తగిలాయి. వద్దని వాళ్ళు మొత్తుకుంటున్నా వాళ్ళను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారని, వాళ్ల షాక్‌కు గురయి కోలుకుంటున్నారని కుల టీవీల్లో వార్తల మీద విరిగిపోయే వార్తలు, స్క్రోలింగులు, ఓహ్... మూకుమ్మడి మానభంగాల్లా వచ్చాయి. ఈరారం ఊరి పెద్దల ఇంటర్వ్యూలు తీసుకుని, ప్రశంసలను పదేపదే ప్రసారం చేశారు.

అయితే, పడమర వయిపు పెట్టిన గండికి ఇరవయి అయిదు మంది వరదల్లో కొట్టుకుపోయారని, వారి మాదిగ పల్లెలో కనీసం ఒక్కరంటే ఒక్కరయి గొడ్డూ గోదా ప్రాణాలతో బతకలేదని ఒక్కటంటే ఒక్క ఎలక్ట్రానిక్ మీడియాలో రాలేదు. చివరకు వార్తల్లో కూడా ఎక్కడా చోటుచేసుకోలేదు. వాళ్ళు మనుషులని ఒక్కడంటే ఒక్కడికయినా అనిపించలేదా? టీ.వీ.లకు జాతీయ, అంతర్జాతీయ బహుమతులు వచ్చాయని చెప్పిందే చెప్పుకోవడం మొగలిపువ్వును ఎక్కడో మడిచిపెట్టుకున్నట్టుకాదా?

*** ఆదివారం వార్త, 15 నవంబరు 2009**